ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు

సోమవారం 18 ఆగస్టు 2025




**అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయాలి**

● మాదిగ సంఘం నాయకుల కూటమి డిమాండ్

6

**హంపిలో ట్రాఫిక్ జామ్**

● ఇబ్బందిపడ్డ వాహనదారులు

# లక్షన్నర మంది ఫెయిల్





● ఎస్ఎస్ఎల్‌సీలో మూడుసార్లు పరీక్షలు నిర్వహించినా వృథానే

● కలబురగి, బెంగళూరులోనే అత్యధిక మంది ఫెయిల్

● సరిహద్దు జిల్లాల్లో మరింత ఘోరం ● చర్యలకు విద్యాశాఖ సిద్ధం

బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో గుణాత్మకత పెంచడంతో పాటు పరీక్షల విధానాన్ని సంస్కరించేందుకు రాష్ట్రంలో విద్యాశాఖ పదో తరగతి పరీక్షలను ఒకసారి మెయిన్‌గాను, రెండుసార్లు సప్లిమెంటరీతో కలిపి మూడు సార్లు పరీక్షలు జరిపినా ఏకంగా 1.59 లక్షలమంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఇది విద్యాశాఖకు అప్రతిష్ఠగా మారింది. రాష్ట్రంలో 35 విద్యాపరమైన జిల్లాలు ఉన్నాయి. ఇందులో కేవలం ఐదు జిల్లాల్లో మాత్రమే 'ఏ' గ్రేడ్ పొందాయి. కర్ణాటక పరీక్షా ప్రాధికార, మౌల్యమాపన మండలి గడిచిన రెండేళ్లుగా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలను మార్చిలో నిర్వహిస్తోంది. అందులో ఫెయిల్ అయినవారికోసం మే నుంచి జూలైల మధ్యన సప్లిమెంటరీ 2, 3 పరీక్షలను నిర్వహిస్తోంది. 35 విద్యాజిల్లాలను పరిశీలిస్తే ఆరు జిల్లాల్లో మాత్రమే కనీసమైన సాధన పొందాయి. కలబురగి, యాదగిరి, రాయచూరు, బళ్ళారితోపాటు పలు జిల్లాల్లో 50-65శాతం ఫలితాలను నమోదు చేసేందుకు పెను సాహసమే చేయాల్సి వస్తోంది.




బెంగళూరులోని ఎస్ఎస్ఎల్‌సీ బోర్డు కార్యాలయం

**జిల్లాల వారీగా ఫెయిలైన వారి సంఖ్య**

| జిల్లా పేరు | విద్యార్థులు |
|---|---|
| కలబురగి | 17,250 |
| బెంగళూరు దక్షిణ | 10,546 |
| చిక్కోడి | 8,551 |
| విజయపుర | 8,282 |
| బెంగళూరు ఉత్తర | 7,810 |
| రాయచూరు | 7,286 |
| బీదర్ | 6,865 |
| మైసూరు | 6,799 |
| చిత్రదుర్గ | 6,471 |
| యాదగిరి | 5,795 |
| బళ్ళారి | 4,192 |

## విద్యాసంవత్సరం వృథా కాకుండా...

సాధారణంగా అన్ని పరీక్షలు జరిగినట్టే మార్చి/ఏప్రిల్‌లో ఎస్ఎల్ఎల్‌సీ పరీక్షలు ముగుస్తాయి. అయితే ఇక్కడ ఫెయిల్ అయినవారు తదుపరి వెంటనే పరీక్షలు జరిపితే ఎంతో కొంత ప్రయోజనం ఉంటుందని భావించింది. పైగా సప్లిమెంటరీ పరీక్షలు సెప్టెంబరు/అక్టోబరు తర్వాత నిర్వహిస్తే ఏడాదిపాటు విద్యాసంవత్సరం కోల్పోవాల్సి వస్తుంది. అయితే ఇక్కడ... చదువుపై శ్రద్ధ తగ్గడం మరోవైపు బాలకార్మికులుగా మారే ప్రమాదం ఉంది. అందుకే ప్రభుత్వం సప్లిమెంటరీలను రెండుసార్లు నిర్వహించడం ద్వారా ఎక్కువమంది ఉత్తీర్ణత సాధించి తదుపరి విద్యవైపు వెళ్తారు. మరోవైపు ఐటీఐ, డిప్లమా వంటి వృత్తి విద్యాకోర్సులలో ప్రవేశించేందుకు వీలుంటుంది. నిరంతరంగా చదివితే వారిలో ఆలోచనా శక్తి, నైపుణ్యత సాధ్యమై ఉన్నతవిద్యవైపు వెళ్లేందుకు వీలుంటుంది. 2024-25 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో 7,96,785 మంది విద్యార్థులు ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు రాశారు. ఇందులో మూడుసార్లు పరీక్షలలో కలిపితే 6,37,196 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంకా 1,59,589 మంది విద్యార్థులు మూడుసార్లు పరీక్షలలోనూ ఫెయిల్ అయ్యారు.

### సరిహద్దు జిల్లాల్లో దిగజారిన ఫలితాలు

మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు జిల్లాల్లోనే అధికశాతం విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారు. ప్రధానంగా కలబురగి, బెళగావి, చిక్కోడి, రాయచూరు, విజయపుర, చిత్రదుర్గ, బళ్ళారి, బీదర్ జిల్లాల్లో ఫెయిల్ శాతం అధికంగా ఉంది. ఈ జిల్లాలకు చెందినవారు మహారాష్ట్రలో కూలి పనులకు వెళ్తున్నారు. దీంతో పిల్లలు పాఠశాలలకు దూరమవుతున్నారు. ఇది సరిహద్దు జిల్లాల ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. ఎక్కువమంది విద్యార్థులు మరాఠీ, తెలుగు ప్రభావంతో కన్నడ భాషలో చదవడం కష్టతరంగా మారుతోంది.



అయితే అది సంపూర్ణమైన కారణం కాదని చెప్పవచ్చు. బెంగళూరు దక్షిణ, బెంగళూరు ఉత్తర జిల్లాల్లోనే 18,356మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. విద్యావ్యవస్థలో గుణాత్మకత బోధన, నైపుణ్యతతో పిల్లలు ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో ప్రతిభ చూపే ఆధారంగా 35 విద్యా జిల్లాలకు ఏటా ఏ, బీ, సీ గ్రేడ్‌లను విద్యాశాఖ ప్రకటిస్తుంది. ఉడుపి, ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ, శివమొగ్గ, హాసన్ జిల్లాలు మాత్రమే ఏ గ్రేడ్‌లో ఉన్నాయి. కలబురగి, యాదగిరి, రాయచూరు జిల్లాలు సీ గ్రేడ్‌లో ఉండగా, మిగిలిన జిల్లాలు బీ గ్రేడ్‌తోనే సంతృప్తి చెందుతున్నాయి. అన్ని సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థుల జాబితాను సేకరించి ప్రాంతీయ విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చలు జరిపి వారిని మళ్లీ పదో తరగతిలో చేర్చుకోవచ్చు. రెండో సంవత్సరంలో వారు ఉత్తీర్ణులయ్యే అవకాశం కూడా ఉంది. ఒకటి రెండు సబ్జెక్టులు ఫెయిలైనవారికి సంబంధిత పాఠశాలలోనే ట్యూషన్ కొనసాగించి సప్లిమెంటరీ రాయించి ఉత్తీర్ణులు చేసేందుకు వీలుంది. ఎస్ఎస్ఎల్‌సీ ఫెయిల్ అయిన విద్యార్థుల పట్ల విద్యాశాఖ ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంది.



అగ్నిప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీకే

# అనుమతి లేని ఇళ్లకు అన్నీ కట్

● 4లక్షల ఇళ్లకు విద్యుత్, నీరు నిలిపివేతకు నిర్ణయం

● బెంగళూరు నగరాభివృద్ధి శాఖ మంత్రి డీకే

● ఐదుగురు సజీవదహమైన ఇంటి పరిశీలన

బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బీబీఎంపీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లకు సర్కారు షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. అనుమతులు లేని భవనాలను గుర్తించి నోటీసులు ఇవ్వాలని బీబీఎంపీ అధికారులను డీసీఎం, బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి డీకే శివకుమార్ ఆదేశించారు. నగరత్‌పేటలో ధర్మరాయస్వామిదేవస్థానం సమీపంలో అగ్నిప్రమాదంలో ఐదుగురు సజీవదహనమైన సంఘటనా స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా భారీ గృహాలు నిర్మించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నగరంలో 2-3 అంతస్థులకు అనుమతులు తీసుకుని, ఏడెనిమిది అంతస్థులు నిర్మిస్తున్నారని, పలుచోట్ల మనుషులు నివసించేందుకు వీలులేనంతగా భవనాలు ఉన్నాయన్నారు. ఇటువంటి భవనాలను గుర్తించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఒక్కరోజులోనే జరిగే పనికాకున్నా తొలుత సర్వే జరిపిస్తామని, సాధ్యమైనంత త్వరగానే ప్రక్రియ ముగిస్తామన్నారు. ఆ తర్వాత అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలకు విద్యుత్, నీరు సరఫరాను పూర్తిగా నిలిపివేస్తామన్నారు. ఈ ప్రక్రియను అమలు చేయకపోతే భవిష్యత్తులో మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మృతుల కుటుంబీకులకు రూ.5 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందజేస్తామన్నారు. నగరంలో 70శాతం నిర్మాణాలు అక్రమంగా ఉన్నాయన్నారు. బీడీఏ లే అవుట్‌లలో సైతం సామర్థ్యానికి మించి అంతస్థులు పెంచుకుంటున్నారన్నారు. ఇలా అగ్నిప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, సరైన జాగ్రత్తలు లేకనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. చిక్కపేట, నగరత్‌పేట ఇవి పేరుకు మాత్రమే నివాసస్థలాలని, కానీ వ్యాపారకేంద్రాలుగా మారిపోయాయన్నారు. పేదరికంతో ఇతర ప్రాంతాలనుంచి వచ్చి ఇళ్లు చిన్నవైనా జీవనం సాగిస్తున్నారన్నారు.

**రాష్ట్రంలో రెండు రోజులు**

7

# భారీ వర్షాలు

● ఐదు జిల్లాల్లో రెడ్ అలర్ట్



## పులకించిన కృష్ణమ్మ

● వైభవంగా కృష్ణాహారతి

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బాగలకోట జిల్లా పరిధిలోని జమఖండి ప్రాంతంలో పొంగి ప్రవహిస్తున్న కృష్ణనదికి నదీతీరంలో శనివారం రాత్రి రంగురంగుల విద్యుత్ దీపాల నడుమ కృష్ణాహారతి వైభవంగా నిర్వహించారు. కృష్ణా నదిపై రెండోసారి జరిగిన కృష్ణాహారతిని తిలకించడానికి నదీతర ప్రాంతంలోని రైతులు, వివిధ ప్రాంతాల నుంచి విశేషంగా తరలివచ్చారు. కృష్ణాష్టమి సందర్భంగా ఎంఆర్ఎన్ నిరాని ఫౌండేషన్, రైతుల ఆధ్వర్యంలో తాలూకాలోని హిప్పరగి బ్యారేజ్ వెనుకవైపు ఉన్న పవిత్ర సంగమేశ్వర మహారాజ్ దేవస్థానం ఆవరణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా పుణ్య స్నానం, కృష్ణా హారతి, పల్లకి ఉత్సవాల్లో సాధువులు పాల్గొనడం విశేషం.



బాగలకోట జిల్లా జమఖండి వద్ద కృష్ణానదికి హారతి పడుతున్న దృశ్యం

## ధర్మస్థళ వివాదంపై సీఎం క్షమాపణ చెప్పాలి



● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళపై నిరంతరంగా దుష్ప్రచారం సాగుతున్న తరుణంలో బీజేపీ రాష్ట్ర పార్టీ నిరసన తెలిపింది. పార్టీ శాసనసభ్యులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు ధర్మస్థళలో ఆదివారం మంజునాథస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ధర్మస్థళపై నిరంతరంగా దుష్ప్రచారం సాగుతోందని వాటిని నియంత్రించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాష్ట్రప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్మస్థళ విషయంలో బీజేపీ రాజకీయం చేయలేదన్నారు. అణ్ణప్పస్వామి పట్ల తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతినేలా కుట్ర చేస్తున్నారన్నారు. లెఫ్టిస్ట్ భావాలు కల్గినవారి ఒత్తిడికి సిట్ ఏర్పాటు చేసినట్టు మంత్రి దినేశ్‌గుండూరావు తెలిపారన్నారు. ధర్మస్థళకు పరమభక్తుడని డీకే శివకుమార్ శాసనసభలో చెప్పారన్నారు. అదే నిజమైతే దుష్ప్రచారాన్ని ఎందుకు కట్టడి చేయలేదన్నారు. దీని వెనుక కుట్రను బహిరంగం చేయాలని, పారదర్శక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

### లెఫ్టిస్టులతో చేతులు కలిపిన కాంగ్రెస్ ప్రభుత్వం

ధర్మస్థళ విషయంలో చెడ్డపేరు తెచ్చేందుకు లెఫ్టిస్ట్ భావాలు కల్గినవారితో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు కలిపిందని పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి ఆరోపించారు. ధర్మస్థళలో మీడియాతో మాట్లాడుతూ ధర్మస్థళలో ఏమీ లభించలేదని, ఇదో కుట్ర అన్నారు. ఈ వివాదంలో ధర్మాధికారి వీరేంద్రహెగ్డే తీవ్రంగా అసంతృప్తితో ఉన్నారన్నారు. ధర్మస్థళకు చెడ్డపేరును సహించలేమన్నారు. ఇదే సందర్భంగా ఎమ్మెల్సీ సీటీ రవి మాట్లాడుతూ ధర్మస్థళ విషయంలో కుట్ర సాగిందని సీఎం, డీసీఎంలు ప్రకటించాలన్నారు. ధర్మస్థళ విషయంలో వాస్తవాలు చెప్పేందుకు భయమైతే కుట్రకు సూత్రధారులు ఎవరో బహిరంగం చేయాలన్నారు.

### శాసనసభలో సమాధానమిస్తా: హోం మంత్రి

ధర్మస్థళ వివాదానికి సంబంధించి సోమవారం శాసనసభలో సమగ్రంగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తానని హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. చామరాజనగర జిల్లా గుండ్లుపేటలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయంలో ఎవరూ రాజకీయం చేయరాదన్నారు. న్యాయం, చట్టానికి సంబంధించిన అంశమన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయడం సహజమన్నారు. ఇందులో రాజకీయం, మతం చేర్చరాదన్నారు. సిట్ దర్యాప్తు చేస్తోందని, వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ధార్మిక అంశాలను రాజకీయంగా వాడుకోవడం సరికాదన్నారు.

## తుంగభద్రకు పెరిగిన వరద ఉధృతి

● 1.25 లక్షల క్యూసెక్కుల నీరు డ్యాంలోకి.. నదిలోకి వదులుతున్న టీబీ డ్యాం అధికారులు

బళ్లారి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి పెరిగింది. జలాశయంపై భాగం నుంచి 1,15,000 క్యూసెక్కుల నీరు తుంగభద్రలోకి వదులుతున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు ఆదివారం వెల్లడించారు. తుంగ జలాశయం నుంచి 75 వేల క్యూసెక్కులు, భద్ర జలాశయం నుంచి 40 వేల క్యూసెక్కులు, వరద నది నుంచి పది వేల క్యూసెక్కులు రూ. లక్ష 25 వేలు క్యూసెక్కుల నీరు తుంగభద్ర జలాశయంలోకి చేరుతున్నాయి డ్యాం భద్రత దృష్ట్యా వరద నీటిని గేట్ల ద్వారా నదికి మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో 78.373 టీఎంసీల నీరు నిల్వ వున్నాయి. జలాశయం చుట్టుపక్కల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. సమీప ప్రదేశం దగ్గరక ఎవ్వరూ రాకూడదని ఆంక్షలు విధించారు.



డ్యాం నుంచి నదిలోకి వస్తున్న నీరు

## వాగులోనే శవయాత్ర

రాయచూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిందనూరు తాలూకా గోమర్సి గ్రామ ప్రజలకు శ్మశానం కష్టాలు తీరడం లేదు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోమర్సి గ్రామ వాగు పొంగిపొర్లుతోంది. దీంతో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు వెళ్లాంటే కష్టాలు తప్పడం లేదు. వాగు దాటేందుకు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందగా ఆదివారం ఆయనకు శవ సంస్కారాలు నిర్వహించేందుకు గ్రామస్థులు బంధువులు, కుటుంబ సభ్యులు సిద్ధమైయ్యారు. పొంగిపొర్లుతున్న వాగు దాటేందుకు మహిళలు, పిల్లలు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మృతదేహంతో వాగు దాటుతున్న గ్రామస్తులు



ప్రమాదంపై ఆరాతీస్తున్న ఎస్పీ శోభారాణి

## ఆగివున్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు


● ఇద్దరి దుర్మరణం

● 12 మందికి గాయాలు

బళ్లారి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రక్కన నిలబడిన లారీని వెనుక నుంచి ఆర్టీసి బస్సు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు దుర్మరణం చెందగా... 12మంది ప్రయాణికులు గాయపడ్డారు. సిరుగుప్ప తాలూకా పరిధిలోని తెక్కలకోట సమీపంలో 150ఏ రాష్ట్ర రహదారి బైరాపుర వద్ద ఘటన చోటు చేసుకుంది. శనివారం రాత్రి ఈ ఘటన జరగడంతో సహాయక చర్యలు ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరిలో రామనగర జిల్లా కనకపుర తాలూకా చౌడసంద్ర గ్రామానికి చెందిన బాల నాయక(42), మరొకరు మండ్య జిల్లా మళవళ్ళి తాలూకాకు చెందిన శ్వేత(38)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సిరుగుప్ప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని బళ్ళారిలోని ట్రామాకేర్ సెంటర్, సిరుగుప్ప తాలూకా ఆసుపత్రికి తరలించారు. సిరిగేరి పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో అన్నదమ్ముల మృతి

కంప్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కురుగోడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మదిరి గ్రామానికి చెందిన రాజన్న (46), విరుపాక్షి (38) అనే ఇద్దరు సోదరులు విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. శనివారం సాయంత్రం పొలంలో మోటార్లు మరమ్మత్తు పనులు మెకానిక్‌తో పనులు చేస్తుండగా ప్రమాదం జరిగింది. విద్యుత్ లైన్లు ఇనుపరాడ్‌పై పడటంతో గమనించని ఇద్దరు సోదరులు ఇనుపరాడ్‌ను తొక్కి విద్యుత్ షాక్‌తో కుప్పకూలారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు కురుగోడు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం ఎస్ఐ సుప్రీత్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం కోసం కురుగోడు ప్రభుత్వాస్పత్రిని తరలించారు. కురుగోడు పోలీసు స్టేషన్లో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఒకే ఇంట్లో సోదరులు మృతి చెందడంతో కుటుంబీకులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.



సోదరుల మృతదేహాలు



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1625.75 | 1623.32 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 1,25,000 | 44,721 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 1,15,000 | 61,424 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 78.97 | 71.14 |

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. బిసిలహళ్ళి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.కోటి వ్యయంతో 4 కొత్త గదుల నిర్మాణం కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. చిన్నమార్కెట్ నిర్మాణ పనుల అంచనా వ్యయం రూ.1.98 కోట్లతో నిర్ణయించి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ ముల్లంగి నందీశ్, ఏపీఎంసీ అధ్యక్షుడు కట్టి మనె నాగేంద్ర,సోము, బిసిలహళ్ళి మంజునాథ్, హొన్నప్ప, కెరకోడప్ప, వార్డు సభ్యులు గోవిందరాజులు, మడివలప్ప, సోమప్ప, హరి పాల్గొన్నారు.

## బొప్పాయి సాగుతో లాభాలు

కంప్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ఈసారి బొప్పాయి రైతుకు కొద్దివరకు లాభాలు వచ్చాయి. ప్రతి ఏటా బొప్పాయి రైతుకు నష్టాలే మిగిలాయి. ఈ సారి బొప్పాయికి మార్కెట్లో డిమాండ్ వుండటంతో రైతుకు ఊరటనిచ్చింది. కిలో రూ.15 నుంచి రూ.20 వుండటంతో పెట్టుబడులు పోయి కొద్దివరకు లాభాలు వచ్చాయి. కంప్లి, కురుగోడు, క్యాంపుల్లో ఈసారి బొప్పాయి పంటలు వేశారు. ఇతర పంటల కన్నా బొప్పాయి పంట లాభాలనిచ్చిందని రైతు సింధిగేరి రమేష్ తెలిపారు.



బొప్పాయిని మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

## ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

సిరుగుప్ప, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మోటారు బైకును ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్ఐ పరమేశ్ తెలిపిన మేరకు తాలుకాలోని బాగవడే గ్రామంలో శనివారం రాత్రి మౌలాసాబ్ రైస్‌మిల్లు వద్ద ట్రాక్టర్ మోటారు బైకుపై వస్తున్న అయ్యప్ప (50) అనే వ్యక్తిని ఢీకొంది. ఆయన పొలంలో పడి ఊపిరాడక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



అయ్యప్ప (ఫైల్)

## అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడు..

కంప్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని జవుకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున (50) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. మల్లికార్జున కొన్ని రోజులుగా గంగావతి హాస్పిటల్‌లో చికిత్స పొందారు. ఈయన మృతికి ప్రజాప్రతినిధులు ప్రముఖులు నివాళులర్పించారు.



మల్లికార్జున (ఫైల్)

## నేత్రదానం

సిరుగుప్ప, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో చిప్పగిరి మఠస్వామి (68) అను వ్యక్తి మృతి చెందాడు. ఆయన కళ్లను దానం చేశారు. యువబిగ్రేడ్ అధ్యక్షులు మంజునాథశెట్టి, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్ ఆధ్వర్యంలో మృతిచెందిన వ్యక్తిని నేత్రాలను సేకరించారు.



మఠస్వామి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ ఇస్తున్న వైద్యులు

# అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయాలి

● మాదిగ సంఘాల నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న మాదిగ సంఘాల నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య అంతర్గత రిజర్వేషన్ల అమలు చేయాలని కర్ణాటక మాదిగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 19వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం నగరంలోని పత్రికాభవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి నాయకుడు రాజేశ్ మాట్లాడుతూ జస్టిస్ నాగమోహన్‌దాసు నివేదిక సమర్పించిన తర్వాత ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాబినెట్ సమావేశాన్ని ఆగస్టు 19కి వాయిదా వేడయం వల్ల అంతర్గత రిజర్వేషన్ల వ్యతిరేకులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి అవకాశం లభించిందన్నారు. జస్టీస్ నాగమోహన్ దాస్ కమిషన్ ఏర్పాటు మాదిగ సమాజం డిమాండ్ కాదన్నారు. కమిషన్‌లో ఒకే అధికారుల బృందం మాత్రమే పనిచేసిందన్నారు. ప్రస్తుతం నివేదికపై వివాదం లేవనెత్తిన తర్వాత క్యాబినేట్ సబ్- కమిటీని ఏర్పాటు చేయాలనే ప్రణాళిక వెనుక అదే వ్యక్తులు చురుకుగా ఉన్నారన్నారు. అంతర్గత రిజర్వేషన్ల పైకాంగ్రెస్ జాప్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నరసప్ప, నరసింహబాబు, హులుగప్ప, కృష్ణ, వెంకటేశ్, షణ్ముఖ, చౌదరి, సీన, హొన్నూరప్ప, కురుబల్లి బాబు, అరుణాచలం, శాంతయ్య, యరగుడి శంకరం, మల్లేశ్, హులిరాజ్, మల్లికార్జున, బి.కె. మల్లికార్జున, రామాంజిన, విశ్వనాథశర్మ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే ఇంటి ముందు నిరసన

బళ్లారి సిటీ: అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోరావాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక మాదిగ సంఘాల నాయకులు ఆదివారం సంగనకల్లు రోడ్డులోని నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. సంఘాల రాష్ట్ర జనరల్ కన్వీనర్ హనుమంతప్ప నేతృత్వంలో ఇతర నాయకులు కార్యకర్తలు అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయడంలో రాష్ట్రప్రభుత్వం చేస్తున్న జాప్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. షెడ్యూల్డ్ కులాల్లో మాదిగలు పెద్ద భాగమని, వారికి విడిగా 6 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై 19న జరిగే మంత్రివర్గ సమావేశంలో స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.



ఎమ్మెల్యే కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

# నిస్వార్థమైనవి డ్రైవర్ల సేవలు

● పంచాయతీ సీఈఓ మహమ్మద్ హారిస్



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ



అవార్డులు అందుకున్న డ్రైవర్లు

బళ్లారి సిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల సేవ నిస్వార్థమైనదని జిల్లా పంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ అన్నారు. కల్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ బళ్లారి డివిజన్, యూనిట్‌లో శనివారం నిర్వహించిన 'సురక్ష చాలక్' రజత పతకం, నగదుబహుమతి పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 5 సంవత్సరాలుగా ప్రమాద రహిత నేరరహిత సేవలను అందించిన డ్రైవర్లకు అవార్డులు అందజేశారు. డ్రైవర్లు అన్ని విధాలుగా నిస్వార్థ సేవలను అందిస్తున్నారని, వారి నిరంతర సేవ ప్రభుత్వానికి ఎంతో గౌరవాన్ని తెస్తోందని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ మాట్లాడుతూ డ్రైవర్లు క్రమశిక్షణ కలిగిన సైనికుల లాంటివారని, వారు ప్రయాణికులను సురక్షితంగా ఇంటికి చేర్చడం ద్వారా రథసారథుల్లా పనిచేస్తారని అన్నారు. వారిని ప్రయాణికులు దేవుళ్లగా భావిస్తారన్నారు. ప్రాంతీయ రవాణా అధికారి బి.శ్రీనివాసగిరి మాట్లాడుతూ డ్రైవర్లు వేగ పరిమితిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పాదచారులను జాగ్రత్తగా చూసుకోవాలని, వాహనం నడిపే సమయంలో ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమానికి డివిజనల్ కంట్రోలర్ ఇనాయత్ బాగ్బన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ డ్రైవర్లు కార్పొరేషన్‌కు అద్దం లాంటివారని, ప్రతిరోజు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా వెళ్లి తిరిగి రావడం ద్వారా కార్పొరేషన్‌కు కీర్తి తీసుకురావాలన్నారు. అనంతరం డివిజనల్ ట్రాఫిక్ ఆఫీసర్ చామరాజా కార్పొరేషన్ తీసుకున్న మార్గం గురించి ప్రసంగం చేశారు.

**విజేతల వివరాలు..:** ప్రమాద రహిత, నేర రహిత సేవలను నిరంతరం అందిస్తున్న సేఫ్ డ్రైవర్‌కు వెండి పతకం, నగదు బహుమతులను అందజేశారు. బళ్లారి యూనిట్-1కి చెందిన కలకప్పగౌడ, ప్రసాద్‌బాబు, రేణుకాచారి, బళ్లారి యూనిట్-2 శివారెడ్డి, మాజీద్, సిరుగుప్ప యూనిట్ సిద్దప్ప, శంకర్‌గౌడ, కురుగోడు శాంతకుమార్, సండూర్ యూనిట్ రుద్రప్ప, వరుసగా 25సంవత్సరాలు డ్రైవర్లుగా సేవలందించి సీనియర్ డ్రైవర్లుగా పదోన్నతి పొందిన 9మందిని సత్కరించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. 2024-25 సంత్సరంలో ఉత్తమ సేవలందించిన ఏడుగురు సిబ్బందికి అవార్డులు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందించి సత్కరించారు. బళ్లారి యూనిట్‌కు చెందిన సోమశేఖర్‌రెడ్డి, యువరాజానాయక్, సంతోష్, ప్రకాశ్,నవీన్‌కుమార్, వీరేశ్, గోపాలకృష్ణ అవార్డులు అందుకున్నారు. 2022 నుంచి 2025 వరకు మూడు సంవత్సరాల కాలంలో సగటున 343 రోజులు సేవలందించిన బళ్లారి 1వ యూనిట్ నిర్వాహకుడు నేమినాథకు రూ. 10,000 నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్‌తో సత్కరించారు. ఈసందర్భంగా బళ్లారి యూనిట్ 1వ యూనిట్ మేనేజర్ పి.శివప్రకాశ్, డివిజనల్ సూపరింటెండెంట్లు,కార్యాలయ సిబ్బంది,డ్రైవర్లు ,సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతప్పకు అవార్డు

కంప్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగర ఉభయ జిల్లాలో దేవాదాయ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న హనుమంతప్పకు శుక్రవారం ఆస్పత్రిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విజయనగర జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్‌ఖాన్ చేతుల మీదుగా సర్వోత్తమ అవార్డు అందుకున్నారు. 2024-25లో హంపి బుక్కసాగర ఏడుపడగల నాగప్ప, మైలార లింగేశ్వర, కొట్టూరు బసవేశ్వర, హొసూరమ్మ, బళ్లారి దుర్గమ్మ దేవస్థానం, కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ఉత్తమ సేవలు అందించడంతో హనుమంతప్పను గుర్తించి అవార్డులను అందించినట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. హనుమంతప్పకు అవార్డు రావడంతో ఉభయ జిల్లాలోని ఆలయాల సిబ్బంది అభినందనలు తెలిపారు.



మంత్రి జమీర్‌ఖాన్ నుంచి అవార్డు అందుకుంటున్న హనుమంతప్ప

## నాయకులకు కృతజ్ఞతలు

● మోహన్‌కుమార్ దానప్ప



గవర్నర్, సీఎంను కలిసిన మోహన్ కుమార్ దానప్ప

కంప్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య వేడుకల్లో కంప్లి పట్టణానికి చెందిన పోలీసులు, ఫిర్యాదులు ప్రాధికార సభ్యులు మోహన్‌కుమార్ దానప్ప, గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, ముఖ్యమంత్రి సిద్దరామయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. మోహన్‌కుమార్ మాట్లాడుతూ తమను గుర్తించి స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానించినందుకు కృతజ్ఞతలన్నారు. మున్ముందు పోలీసు శాఖలో మరింత సేవలు అందించి రాష్ట్ర నాయకులు, అధికారులతో గుర్తింపు పొంది కన్న తల్లిదండ్రులకు, కంప్లి పట్టణానికి గుర్తింపు తీసుకువస్తానని తెలిపారు.

## దొంగల ముఠా అరెస్ట్

సోమందేపల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ వైర్లను దొంగలిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నర్సింగరావు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా ఆర్డీఎస్ఎస్ పథకం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను కత్తిరించి దుండగులు అమ్ముకుంటుండగా ఆదివారం వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సోమందేపల్లి మం డలం బ్రాహ్మణపల్లికి చెందిన ఆదిల్‌బాష, పఠాన్ షబ్బీర్, జమీర్, పఠాన్ జిలానీఖాన్, పఠాని భక్తర్ నిర్మాణదశలో ఉన్న పోల్ నుంచి విద్యుత్ వైర్ల ను అమ్ముకోవడం ప్రారంభించారన్నారు. మండలంలోని రెండుచోట్ల 800 కిలోలు 40 స్తంభాల విద్యుత్‌వైర్లు దొంగలించారన్నారు. అదేవిధంగా రొద్దం మండలంలో రెండుచోట్ల 800 కిలోలు, పెనుకొండ మండలంలో 1500 కి లోల వైర్లు వాటితోపాటు తరలించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారన్నా రు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, ట్రైనీ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.



హేమకూట పర్వత రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

## హంపిలో ట్రాఫిక్ జామ్

● ఇబ్బందిపడ్డ ప్రయాణికులు

బళ్లారి సిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గుముఖం పట్టాయి. శనివారం, ఆదివారం పర్యాటకులు తరలిరావడంతో ఎక్కడిక్కడ ట్రాఫిక్ జామ్ అయ్యింది. సరైన మౌలిక సదుపాయాలు కల్పించకపోడంతో పర్యాటకులు విజయనగర జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా సెలవులు రావడంతో పర్యాటకులు హంపికి పెద్ద సంఖ్యలో వస్తారని అధికారులు అంచనా వేశారు. ఇందకుఉ అనుగుణంగా కనీస మౌలిక సుదుపాయాలు కల్పించలేదు. విజయవిఠల ఆలయంలోని గెజ్జల మంటపం నుంచి రెండు కి.మీ వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఉగ్రనరసింహ సమీపంలో పార్కింగ్ చేయడానికి స్థలం లేదు. అది గుంతలతో నిండిఉంది. విరూపాక్ష ఆలయానికి దారితీసే హేమకూట పర్వతం రోడ్డులో కూడా అనేక వాహనాలు చిక్కుకున్నాయి. వరుసగా సెలవులు రావడంతో వేల సంఖ్యలో పర్యాటకలు సందర్శించారని అంచనా. కమలాపూర్, కడ్డిరాంపుర, హొస్పేట్‌లోని చాలా లాడ్జిలు, కాటేజీలు పర్యాటకులతో నిండిపోయాయి. వీటి ధరలు కూడా రెండు మూడు రెట్లు పెరిగినట్లు కనిపించాయి. మరోవైపు టీబీ డ్యాంను సందర్శించేందుకు పర్యాటకులు తరలివచ్చారు. హంపిలోని అనేక విభాగాల పరిధికి వచ్చే పర్యాటక ప్రదేశాన్ని ఆ శాఖ బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా లేదు. భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ) హంపి వారసత్వ ప్రదేశాల నిర్వహణ అథారిటీ(హెచ్‌డబ్ల్యూఎంఏ) మౌలిక సదుపాయాలు చూసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

## పాఠశాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయండి

● ఎంపీ కుమార్ నాయక్ ఆదేశం



పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ కుమార్ నాయక్

రాయచూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగర సమీపం సంకనూర్ వద్ద నిర్మిస్తున్న ఏపీజే అబ్దుల్ కలాం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఎంపీ కుమార్ నాయక్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. పాఠశాల నిర్మాణ పనులను ఆదివారం ఎంపీ పరిశీలించారు. 2022లో పూర్తి కావల్సిన పనులు ఇప్పటికీ కొనసాగుతుండడం పట్ల ఎంపీ తీవ్ర అసంతృప్తి, అసహనం వ్యక్తం చేశారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను త్వరగతిన పరిష్కరించాలని అక్కడి నుంచి ఫోన్‌లో జిల్లాధికారిని ఆదేశించారు. కాగా కర్ణాటక హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టిన మొరార్జీశాయ్, ఏపీజే అబ్దుల్ కలాం రెసిడెన్షియల్ సీబీఎస్సీ పాఠశాలను తొలి దశలో రూ.21 కోట్లతో నిర్మించనుండగా మలిదశ పనులను రూ.7కోట్లతో మొత్తం రూ.28 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టారు. పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పనుల్లో నాణ్యత ఉండేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

## అక్కా.. నే చనిపోవాలనుకుంటున్నా!

● ఐదు రోజుల కిందట ఫోన్ చేసిన మనోజ్
● ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు సోదరి ఫిర్యాదు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 'అక్కా, నేను తిరుపతి బస్టాండు వద్ద ఉన్నా. నా వల్ల మీరు అప్పులపాలయ్యారు. అందుకని నేను చనిపోవాలనుకుంటున్నా' అని ఈనెల 12వ తేది ఉదయం 6.30 గంటలకు ఎం.మనోజ్ కుమార్ ఫోను చేశారు. ఆ తర్వాత ఫోను స్విచ్ ఆఫ్ అయింది. అప్పట్నుంచి వెదికినా ఆచూకీ లేకపోవడంతో ఆదివారం తిరుపతి పోలీసులకు నాగపావని ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎం.మనోజ్‌కుమార్‌ది అనంతపురం జిల్లాలోని మండల కేంద్రమైన పామిడి గ్రామం. ఇంటి వద్దే ఉంటున్నారు. షేర్ మార్కెట్లో డబ్బులు పెట్టుబడి పెట్టి నష్టపోయారు. ఈనెల పదో తేది ఉదయం 9 గంటలకు ఫోనుచేసి రైలులో తిరుపతికి వెళ్లొస్తానని బయలుదేరి వెళ్లారు. అక్కడ నుంచి తిరుమల కొండకి వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకుని తిరుపతికి వచ్చారు. 12వ తేది ఉదయం 6.30 గంటలకు కళ్యాణదుర్గం మండలంలోని సోదరి నాగపావనికి ఫోనుచేసి చనిపోవాలనుకుంటున్నానని చెప్పి స్విచ్ ఆఫ్ చేయడంతో ఆందోళన చెందారు. 'మేమంతా తిరుపతికి వచ్చి పరిసర ప్రాంతాల్లో వెదికాం. ఎక్కడా మా తమ్ముడి ఆచూకీ తెలియ రాలేదు. మా స్నేహితులు, బంధువులకు చెప్పి వెతకాలని చెప్పాం. ఎంతకీ ఆచూకీ తెలియరాలేదు' అంటూ నాగపావని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

## ఘనంగా జాతీయ కరాటే పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ కరాటే డు అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 43వ జాతీయ స్థాయి కరాటే పోటీలు ఆదివారం ఒంగోలులో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోటీలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాహకులు, జాతీయ కోచ్ నల్లూరి మోహన్‌రావు నేతృత్వంలో జాతీయ స్థాయి పోటీలు ఒంగోలులో నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ప్రతి క్రీడాకారుడు గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలని చెప్పారు. కరాటేతో ఆత్మస్థైర్యం, కృషి, పట్టుదల లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ఎమ్మెల్యేలు బీఎన్, ముత్తుముల బహుమతి ప్రదానం చేశారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ 30ఏళ్లుగా కరాటే అకాడమీ నిర్వహిస్తూ మోహన్‌రావు ఎందరో క్రీడాకారులను జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దారన్నారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆత్మ రక్షణకు కరాటే మరింత ఉపయోగపడుతుందని చెప్పారు. అకాడమీ ప్రెసిడెంట్ మండవ మురళీకృష్ణ, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఆలిండియా కోచ్ కొండూరు, శ్రీప్రతిభ సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, డాక్టర గుండవరపు రాఘవ, శ్రీహర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, మండవ సుబ్బారావు పాల్గొన్నారు. ఒకరోజు జరిగిన ఈ పోటీలలో 12 రాష్ట్రాల నుంచి 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ విజేత అనంతపురం

పిఠాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు వద్ద గల మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న 10వ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లు విజేతగా నిలిచాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 4 రోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. బాలుర విభాగంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 13 జట్లు, బాలికల విభాగంలో 12 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో అనంతపురం జట్టు విజేతగా నిలవగా... రెండోస్థానంలో పశ్చిమగోదావరి, మూడోస్థానంలో కృష్ణా జిల్లా జట్టు నిలవగా... బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలవగా, రెండోస్థానంలో తూర్పుగోదావరి జిల్లా నిలిచింది.

## హోసూరు జోన్

## పోస్టాఫీస్ మార్పుపై నిరసన



రోడ్డుపై బైఠాయించి గ్రామస్థుల నిరసన

హోసూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వందేళ్లకుపైగా పనిచేస్తున్న హోసూరు సమీపంలోని పోస్టాఫీసును మరో గ్రామానికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించిన నిరసన తెలిపారు. ఉత్తనపల్లిలోని పోస్టాఫీసును మూడురోజులక్రితం కృష్ణాపుర గ్రామానికి మార్పు చేశారు. ఎటువంటి నోటీసు లేకుండానే మార్పు చేశారని గ్రామస్తులు ఆరోపించారు. బస్టాండ్, ఇతర సౌకర్యాలు లేని ఆ గ్రామానికి నడిచి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. 50మందికిపైగా గ్రామస్తులు నిరసనలో పాల్గొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గ్రామస్తులకు నచ్చచెప్పారు. సోమవారం త్రిసభ్య సమావేశం జరుగుతుందని హామీ ఇవ్వడంతో నిరసన వీడారు. రాస్తారోకో కారణంగా గంటకుపైగా ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది.

## డీఎంకేలోకి పలువురి చేరిక

హోసూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే ప్రకాశ్ సమక్షంలో 300మందికిపైగా యువకులు డీఎంకేలో చేరారు. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో యువజనసంఘం ఇన్‌చార్జ్ రామమూర్తి నేతృత్వం వహించారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేలా కార్యకర్తలు చొరవ చూపాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



ఎమ్మెల్యేతో కొత్తగా చేరిన కార్యకర్తలు

## ఆటోలో బంగారు నగలు చోరీ

గోరంట్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన శాంతమ్మ ఆటోలో ప్రయాణిస్తుండగా ఆదివారం రాత్రి దాదాపు ఏడు తులాల బంగారం నగల చోరీ అయ్యాయి. బాధితురాలు తెలిపిన మేరకు.. చిక్‌బళ్లాపూర్‌లోని కుమార్తె నిర్వహిస్తున్న వరలక్ష్మీ వ్రతంలో శుక్రవారం పాల్గొనడానికి నగలు తీసుకెళ్లి పూర్తి అయిన తరువాత తిరిగి వస్తుండగా నగలు చోరీ అయ్యాయి. చిక్‌బళ్లాపూర్‌నుంచి బాగేపల్లివద్ద టీబీ క్రాస్ వద్ద దిగి ఆటోలో గోరంట్లకు వస్తుండగా సంఘటన చోటుచేసుకుంది. టీబీ క్రాస్‌వద్ద శాంతమ్మ ఆటోలో బయలుదేరిన సమయంలో మరో ముగ్గురు మహిళలు ఎక్కి గోరంట్లలోని మోర్ మార్కెట్‌వద్ద దిగారు. శాంతమ్మ ఇంటికెళ్లి హ్యాండ్ బ్యాగులోని నగలు చూసుకోగా, నెక్లెస్, లాంగ్ చైన్, మరో చైన్ చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

### విజయలక్ష్మి పండిట్ (జయంతి)



విజయలక్ష్మి పండిట్ 1900 ఆగస్టు 18న అలహాబాద్‌లో జన్మించారు. దేశ ప్రముఖ రాజకీయనేత మోతీలాల్ కుమార్తె. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీకి తొలి మహిళా అధ్యక్షురాలిగా 1953-54 మధ్య వ్యవహరించారు. మహారాష్ట్ర గవర్నర్‌గా, ఎంపీగా వ్యవహరించారు. 1947 తర్వాత పలు విదేశాలకు రాయబారిగా వ్యవహరించారు. ఆమె సోదరుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశ తొలి ప్రధానిగా కొనసాగిన విషయం విదితమే. 1990 డిసెంబరు 1న కన్నుమూశారు.

### చెంఘిజ్ ఖాన్ (వర్ధంతి)



మంగోల్ సామ్రాజ్య స్థాపకుడు చెంఘిజ్‌ఖాన్ 1162 ఏప్రిల్ 16న జన్మించారు. ఆయన స్థాపించిన సామ్రాజ్యం ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యంగా గుర్తింపు పొందింది. ఆయన అసలు పేరు టెమూజిన్. చెంఘిజ్‌ఖాన్ అని తనకు తానుగా ప్రకటించుకున్నాడు. మధ్య ఆసియా, చైనాకు చెందిన అనేక సంచారతెగలను ఐక్యం చేస్తూ ఆయన అధికారంలోకి వచ్చారు. సుమారు 11-12 మిలియన్ చదరపు అడుగులు అంటే దాదాపు ఆఫ్రికా ఖండం అంతటి ప్రాంతాన్ని పాలించి తనదైన చరిత్రను లిఖించారనడంలో సందేహం లేదు. 1227 ఆగస్టు 18న కన్నుమూశారు.

### నేతాజీ సుభాష్‌చంద్రబోస్ (వర్ధంతి)




నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 1897 జనవరి 23న కటక్‌లో జన్మించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో యువత చురుగ్గా పాల్గొనేలా కీలకంగా వ్యవహరించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికైనా సిద్ధాంతపరమైన విభేదాలతో రాజీనామా చేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఆంగ్లేయులపై పోరాడేందుకు రష్యా, జర్మనీ, జపాను దేశాలలో పర్యటించి భారత జాతీయ సైన్యాన్ని ఏర్పాటు చేశారు. జపాన్ ప్రభుత్వ సాయంతో ఆజాద్ హింద్ ఫౌజ్‌ను సింగపూర్‌లో ఏర్పాటు చేశారు. 'మీ రక్తాన్ని ధార పోయండి... మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను...' అనే నినాదం ఎంతో ప్రభావితం చేసింది. 1943లో ఇండియన్ నేషనల్ ఆర్మీకి అధ్యక్షుడిగా పనిచేశారు. 1945 ఆగస్టు 18న విమానప్రమాదంలో కన్ను మూశారు. ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంపులు విడుదల చేశారు.

### కోఫీ అన్నన్ (వర్ధంతి)



ఘనా దేశం కుమాసిలో కోఫీ అన్నన్ 1938 ఏప్రిల్ 8న జన్మించారు. ఐక్యరాజ్య సమితికి ఏడవ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించి పలు సంస్కరణలు తెచ్చారు. ఆఫ్రికా ఖండం నుంచి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మొదటి నల్లజాతీయుడు. రెండుసార్లు ఎన్నికై పదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకై ప్రజలలో చైతన్యం కల్పించారు. 2001లో నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నారు. 2003లో ఇందిరాగాంధీ శాంతి బహుమతి, 2007లో బ్రిటీష్ రాణి నుంచి 'నైట్‌హుడ్' బిరుదు అందుకున్నారు. 2018 ఆగస్టు 18న కన్నుమూశారు.

### గుల్జార్ (పుట్టినరోజు)




రచయిత, కవి గుల్జార్ 1934 ఆగస్టు 18న పంజాబ్ రాష్ట్రంలో జన్మించారు. అసలు పేరు సంపూరన్‌సింగ్ కల్రా. కవి, గేయ రచయితగా, స్క్రీన్‌రైటర్‌గా, సినీ దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. పరిచయ్, కోషిష్, ఆనంది, మౌజం వంటి సినిమాలు ఎంతో పేరొందాయి. 5 జాతీయ, 22 ఫిల్మ్‌ఫేర్, ఒక అకాడమీ, ఒక గ్రామీ అవార్డు అందుకున్నారు. 2004లో పద్మభూషణ్ పురస్కారంతోపాటు సాహిత్య అకాడమీ అవార్డు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఇతర గౌరవాలు పొందారు. అసోం యూనివర్సిటీ చాన్సెలర్‌గా వ్యవహరించారు. బెన్నెట్ కోలమన్ కంపెనీ ప్రచురించిన గ్లోబల్ ఇండియన్స్ 2022 లో 25మందిలో చోటు దక్కించుకున్నారు. 2024లో జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నారు.

### రాబర్ట్ రెడ్‌ఫోర్డ్ (పుట్టినరోజు)



ఛార్లెస్ రాబర్ట్ రెడ్‌ఫోర్డ్ జూనియర్ 1936 ఆగస్టు 18న జన్మించారు. అమెరికాలో పేరొందిన నటుడు, డైరెక్టర్‌గా ఎన్నో సినిమాలు అందించారు. 'ది స్టింగ్' అండ్ 'ది వే ఉయ్ వర్' సినిమాలు ఎంతో పేరొందాయి. 'ఆర్డినరీ పీపుల్'కు ఆస్కార్ అవార్డు దక్కింది. 60ఏళ్ల కెరీర్‌లో జీవిత సాఫల్య పురస్కారంతోపాటు ఎన్నో సినీ పురస్కారాలు అందుకున్నారు. 2016లో 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'ను బారక్ ఒబామాచే అందుకున్నారు.

### నిర్మలా సీతారామన్ (పుట్టినరోజు)



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ 1959 ఆగస్టు 18న తమిళనాడు రాష్ట్రం మదురైలో జన్మించారు. 2014నుంచి రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. రక్షణశాఖ మంత్రిగాను వ్యవహరించారు. ఇందిరాగాంధీ తర్వాత ఈ హోదాలో కొనసాగిన మహిళగా గుర్తింపు పొందారు. ఫోర్బ్స్ మ్యాగజైన్‌చే 2023లో ప్రపంచంలో వందమంది ప్రముఖ శక్తివంతమైన మహిళల్లో 37వ ర్యాంకును పొందారు. బీజేపీలో జాతీయస్థాయిలో కీలక హోదాలలో కొనసాగారు. వరుసగా ఎనిమిది సార్లు బడ్జెట్ ప్రతిపాదించిన ఘనత సాధించారు.

### టమోటా కిలో రూ.42

అనంతపురంరూరల్, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.42తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.24, సరాసరిగా రూ.32తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,300 టన్నుల టమోటాలు వచ్చినట్లు తెలిపారు.

# 'దేశాల మధ్య సామరస్యమే లక్ష్యం'



వేదికపై ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దేశాల మధ్య సామరస్యమే లక్ష్యంగా ఒకే ప్రపంచం - ఒకే కుటుంబం అనే నినాదంతో ప్రపంచ సాంస్కృతిక మహోత్సవం 2025 పేరిట వందరోజుల జాతీయస్థాయి సదస్సు చిక్కబళ్ళాపుర జిల్లా ముద్దేనహళ్ళి సత్యసాయి గ్రామంలో ఆదివారం ప్రారంభమైంది. కేంద్రప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) సహకారంతో సదస్సు నిర్వహిస్తున్నారు. కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ ముఖ్యులు మధుసూధనసాయి, పద్మభూషణ్ గ్రహీత, కర్మయోగి భారత్ అధ్యక్షులు, కళాక్షేత్ర ఫౌండేష్ మాజీ అధ్యక్షులు సుబ్రమణియన్ రామదొరై తదితరులు సదస్సు తొలిరోజులో భాగస్వామ్యులయ్యారు. ప్రపంచమంతా ఒకే కుటుంబం అని చాటేలా వందరోజులపాటు వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు, కళాబృందాలు పాల్గొని సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పనున్నాయి. వందరోజుల ఉత్సవంలో వంద దేశాలను ఏకం చేసేలా సంస్కృతి, ఆధ్యాత్మికత, సేవా, మానవత్వాన్ని పెంపొందించేందుకు ఈ సదస్సు వేదిక కానుందన్నారు. పవిత్ర సంప్రదాయాలనుంచి ఆధునిక కళారూపాల వరకు, అంతర్గత సంభాషణలనుంచి కళా ప్రదర్శనల వరకు ఈ ఉత్సవం చాటనుంది. భారత సాంస్కృతిక సంపదను ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శనలను ఐజీఎన్‌సీఏ ఆధ్వర్యంలో కొనసాగుతాయని కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్ తెలిపారు. ఈ సదస్సు ప్రపంచ సాంస్కృతిక మహోత్సవం 2025 కు ప్రతీకగా నిలుస్తుందని మధుసూదనసాయి అభిప్రాయపడ్డారు. బెంగళూరు లోని ఐజీఎన్‌సీఏ సదరన్ రీజనల్ సెంటర్ డైరెక్టర్ మహేంద్ర, రాష్ట్రప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ టీబీ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మైసూరులో విష్ణు స్మారకం ఏర్పాటు చేస్తాం: అనిరుధ్



బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అభిమాన్ స్టూడియో లో నటుడు విష్ణువర్ధన్ సమాధి తొలగించిన విషయమై జయనగర్‌లోని విష్ణువర్ధన్ ఇంటి వద్ద ఆదివారం విష్ణు అభిమానుల సమావేశం జరిగింది. విష్ణువర్ధన్ అల్లుడు అనిరుధ్ పిలుపు మేరకు అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఇదే సమయంలో అభిమాన్ స్టూడియోలో స్థలం లేదని, మైసూరులో స్మారకం ఏర్పాటు చేస్తామన్నారు. అంత్యక్రియలనాటి అంశాలను ప్రస్తావించారు. ఇటీవలే ప్రముఖ నటుడు కిచ్చ సుదీప్ ఆ స్థలం కొనుగోలు చేస్తామని వ్యాఖ్యానించిన అంశాన్ని అనిరుధ్ పరోక్షంగా మండిపడ్డారు. అభిమాన్ స్టూడియోలోనే స్థలం తీసుకుని అక్కడే స్మారకం ఏర్పాటు చేస్తామని అంటున్నారన్నారు. ఆరేళ్లుగా మేం ప్రయత్నం చేశామని, ప్రభుత్వం ముందుకొచ్చి స్థలం ఇచ్చిందన్నారు.

బాలణ్ణ కుమారుడు మీడియా ముందుకు వచ్చి తీవ్రంగా దూషించారని, అందుకే 2016 నుంచి అక్కడికి వెళ్లలేదన్నారు. తొమ్మిదేళ్లుగా ఎందుకు కొనుగోలు చేయలేదని ప్రశ్నించారు. అభిమాన్ స్టూడియో ప్రభుత్వ స్థలమని దానినుంచి మాకు లాభం లేదన్నారు. కానీ తప్పుగా మాట్లాడడం సరికాదన్నారు. మైసూరులో స్మారకం శాశ్వతంగా స్మారకం నిర్మిస్తామనడం సరికాదన్నారు. అందుకు కొందరు అభిమానులు వ్యతిరేకించారు. మరోవైపు వర్షంలోనూ ఆందోళన చేశారు.

## మహిళల ఆరోగ్యంపై జాతీయస్థాయి చర్చ



చర్చాగోష్టిలో డాక్టర్ శంతనుపాఠక్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మహిళా ఆరోగ్యం, స్వావలంబనపై కటింగ్ ఎడ్జ్ 2025 పేరిట జాతీయస్థాయిలో చర్చాగోష్టి జరిగింది. కర్ణాటక వైద్యవిద్యా విభాగం భాగస్వామ్యంతో 700 నర్సింగ్ కళాశాలల అకడమిక్ పాఠ్యాంశాలలో మాతృత్వం, శిశుసంరక్షణ జ్ఞానాన్ని పెంపొందించే దిశగా చర్చలు జరిగినట్లు డోటో హెల్త్ ఫౌండర్ డాక్టర్ శంతనుపాఠక్ అభిప్రాయపడ్డారు. గణాంకాలు ఏ స్వరూపంలో ఉన్నా రోగి వ్యక్తిగత అనుమతి లేకుండా ఎవరితోనూ పంచుకునేందుకు అవకాశం ఉండదన్నారు. ఎటువంటి పరిశోధన కైనా నిపుణుల కమిటీ, రోగి అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. మహిళలకు 15వ ఏట నుంచే రుతుచక్రం ప్రారంభమవుతుందని, ప్రతిదశలోనూ ముందు జాగ్రత్తగా వారు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వస్తే సమగ్ర అధ్యయనం చేయాలన్నారు. ఆర్టిస్ట్ ఫర్ హర్ సంస్థ ప్రతినిధి డాక్టర్ హేమాదివాకర్ మాట్లాడుతూ 2007 నుంచి నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆర్టిస్ట్ ట్రైనింగ్ నెట్‌వర్క్ చత్తీస్‌ఘడ్, ఒడిశా, జార్ఖండ్‌లతో కలిపి 4వేల ఆసుపత్రుల పరిధిలో ఉందన్నారు. ఆరోగ్యకరమైన పల్లెలు సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని, ఆ దిశగా గ్రామీణ ప్రాంతాల ప్రజలను చైతన్యం చేస్తున్నట్టు డాక్టర్ హేమా తెలిపారు.

### ఉత్సాహంగా

## 'రన్ ఫర్ రాజీవ్'

బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రన్ ఫర్ రాజీవ్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. నగరంలోని కంఠీరవ స్టేడియంలో డీసీఎం డీకే శివకుమార్ 5కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఎం మాట్లాడుతూ ప్రతిరోజూ ప్రతి వ్యక్తి ఆరోగ్యం కోసం కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. రన్ ఫర్ రాజీవ్ మారథాన్‌కు భారీసంఖ్యలో యువత పాల్గొనడాన్ని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, జాతీయ యువ కాంగ్రెస్ నేత బీవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



5కే రన్‌కు శ్రీకారం చుడుతున్న డీసీఎం



రన్‌లో భాగంగా విన్యాసాలు

## రేపు తాలూకా కార్యాలయం ముట్టడి



విశ్వనాథరెడ్డి

దొమ్మసంద్ర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా కార్యాలయాన్ని ఈనెల 19న ముట్టడించేలా ఆనేకల్ తాలూకా భూస్వాధీన వ్యతిరేక పోరాట సమితి గౌరవాధ్యక్షుడు ముత్తనల్లూరు విశ్వనాథరెడ్డి మీడియాకు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాలూకా సర్జాపుర హోబళిలో 13 గ్రామాలలో 2500 ఎకరాల భూమిని పారిశ్రామిక ఉద్దేశ్యాలకోసం స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ రైతుల పోరాటం రోజురోజుకు అధికమవుతోంది. గత ఏడాదిన్నర క్రితం నుంచి భూస్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ రైతులు పోరాటం చేస్తున్నారు. రైతుల డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం, కేఐఏడీబీ అధికారులు విఫలమయ్యారు. జూలై 18న బైక్ ర్యాలీ ద్వారా ఫ్రీడంపార్కు వరకు నిరసన తెలిపారు. అప్పుడే కేఐఏడీబీ ప్రత్యేక భూస్వాధీనం అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారంలోగా రైతులు, శాఖ అధికారులు సంయుక్తంగా జాయింట్ సర్వే జరిపి, ముఖ్యమంత్రితో సభ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో ఈనెల 19న మంగళవారం ఉదయం 11 గంటలకు ఆనేకల్ తహసీల్దార్ కార్యాలయం ముట్టడి చేపట్టేలా పోరాటనేతలు నిర్ణయించారు.

## ఘనంగా కృష్ణాష్టమి

బెంగళూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆర్ట్ కల్చరల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఎంజీరోడ్డు మెట్రో రంగోలి సభాంగణంలో ఆదివారం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఫౌండేషన్ సంస్థాపకురాలు అంబికా సీ ఏర్పాట్లు చేశారు. కళాధామ కథక్ డ్యాన్స్ స్కూల్ గురువు నూపుర్ భార్గవ్ శిష్యురాలు మౌసం మోహంతి, షబ్నం ఛత్రిలు కథక్ నృత్యాన్ని ప్రదర్శించారు. ప్యాషన్ డ్యాన్స్ స్కూల్ లక్ష్మీశ్రీ శిష్యులు శివాన్ శిఖ, శారిక, శ్రేయలు కృష్ణలీల పేరిట నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారులు కాశ్వి, ఓజస్వి కృష్ణ వేషధారణతో కృష్ణాష్టమి వేడుకలు ఉత్సాహంగా సాగాయి. కాగా వేర్వేరు పాఠశాలల్లో చిన్నికృష్ణుల వేషధారణ పోటీలు అలరించాయి. పోటీల విజేతలకు బహుమతులు అందచేసి ప్రోత్సాహించారు. రాధాకృష్ణుల పోటీలలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



సుంకదకట్టె అంజలి కాన్వెంట్‌లో చిన్నికృష్ణుల సందడి



మెట్రో రంగోళిలో చిన్నికృష్ణుడి చుట్టూ గోపికల కోలాటం

## ఉత్తమ సేవలకు సేవారత్న పురస్కార ప్రదానం



అనిల్‌కుమార్‌కు పురస్కారంతో సత్కారం

శిడ్లఘట్ట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నగరసభ 11వ వార్డు సభ్యుడిగా తొలిసారిగా గెలుపొంది ఐదేళ్లపాటు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో రాణించిన అనిల్‌కుమార్ సేవామనోభావం ఆదర్శప్రాయంగా నిలిచారని వార్డువాసులు సేవారత్న పురస్కారంతో సత్కరించారు. పార్టీతో నిమిత్తం లేకుండా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, డ్రైనేజీ, వీధిదీపాల సమస్యలను నగరసభ గ్రాంట్లకోసం వేచియుండకుండా సొంత ఖర్చుతో బాగు చేసి ప్రజల మనస్సులను గెలుచుకున్నారు. కొవిడ్‌వంటి క్లిష్ట సమయంలో ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా సాహితీవేత్త ఎన్ శివణ్ణ, ప్రముఖ పట్టు సంస్థ ప్రముఖుడు రాధానామాలు, లక్ష్మీనారాయణప్ప, బీజేపీ తాలూకా అధ్యక్షుడు సీకల్ ఆనందేగౌడ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రెండు రోజులు భారీ వర్షాలు

**ఐదు జిల్లాల్లో రెడ్ అలర్ట్**

బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో నాలుగైదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. ఈమేరకు ఐదు జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. చిక్కమగళూరు జిల్లాలో సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఓవైపు కాఫీతోటల పరిధిలో నిరంతరంగా వర్షాలు కురుస్తున్నందున మట్టిదిబ్బలు కుంగిపోయే ప్రమాదం ఉందని జాగ్రత్తలు పాటించాలని జిల్లా అధికారి మీనా నాగరాజ్ ఆదేశించారు. దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, చిక్కమగళూరు, శివమొగ్గ, ఉడుపి జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. బెంగళూరు గ్రామీణ, కలబురగి, విజయపుర, బీదర్‌తోపాటు మరో పది జిల్లాల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించారు. చిక్కమగళూరు జిల్లా పరిధిలో చార్మాడిఘాట్‌లో మట్టి చరియలు విరిగిపడ్డంతో రాకపోకలు నిలిపివేశారు. రైలు సంచారం కూడా ఈ మార్గంలో స్తంభించింది. దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాలనుంచి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సంచారం సాగుతోంది.

## ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగండి

**విద్యార్థులకు ఎమ్మెల్యే హితవు**



విద్యార్థికి ల్యాప్‌టాప్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, విద్యార్థులు కలలుకనాలని వాటిని సాకారం చేసుకునేందుకు ఎంతో శ్రమించాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి విద్యార్థులకు హితవు పలికారు. పట్టణ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రస్తుత పోటీయుగంలో టెక్నాలజీతో పోటీపడి రాణించేందుకు ల్యాప్‌టాప్‌లను ప్రభుత్వం ఇస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవితంలో రాణించాలంటే ప్రామాణిక ప్రయత్నాలు చేయాలన్నారు. తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు. 45 ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, గుడిబండ గ్యారెంటీ పథకాల సమితి అధ్యక్షుడు ఆదిరెడ్డి, శాంతకుమారి, రాజలక్ష్మి వీణాపాణి, లతా తదితరులు పాల్గొన్నారు.

## చార్టెర్డ్ సహకార బ్యాంకు రజత మహోత్సవం



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సహకారబ్యాంకు ప్రముఖులు

బొమ్మనహళ్ళి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): చార్టెర్డ్ సహకారబ్యాంకు రజత మహోత్సవం కోరమంగల సెయింట్‌జాన్స్ ఆడిటోరియంలో జరిగింది. ఆదివారం కార్యక్రమాలు సాగాయి. 25ఏళ్లుగా బ్యాంకు అందిస్తున్న సేవలను సమగ్రంగా వివరించారు. ఇదే సందర్భంగా ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. 2022లో బెస్ట్ కోఆపరేటివ్ బ్యాంకు పురస్కారం లభించిందని బ్యాంకు సంస్థాపక అధ్యక్షుడు మునిరెడ్డి తెలిపారు. వందలకోట్ల టర్నోవర్ చేస్తూ తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నామన్నారు. వేలాదిమంది ఖాతాదారులనుంచి మంచి స్పందన ఉందన్నారు. ఏటీఎం, ఆర్‌టిజీఎస్, ఐఎంపీఎస్, మొబైల్‌బ్యాంకింగ్, నెట్‌బ్యాంకింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. 188 కోట్ల రూపాయల లాభం రాగా 56 కోట్లు ప్రభుత్వానికి పన్నురూపంలో చెల్లించినట్టు తెలిపారు. సామాజిక సేవలలో భాగంగా మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామన్నారు. కోరమంగల, దొమ్మసంద్రలలో శాఖలు ఉన్నాయని త్వరలో హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో బ్యాంకుశాఖ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రజతమహోత్సవం సందర్భంగా సభ్యులం దరికీ 10 గ్రాముల వెండినాణెంను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహకారసంఘాల జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్, ఇన్‌చార్జ్ డైరెక్టర్ వెంకటరెడ్డి, సంస్థాపక అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ స్థలంలో ప్రభుత్వ భవన నిర్మాణానికి నిర్ణయం

## జీర్ణించుకోలేక మహిళ ఆత్మహత్య



రాజమ్మ(ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా హనూరు తాలూకా దొడ్డఆలత్తూరు గ్రామంలో రాజమ్మ (52) అనే మహిళ తమకున్న 20 సెంట్ల పొలంలో ప్రభుత్వం భవనం నిర్మించాలని అధికారులు తీర్మానించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. గ్రామంలో సోమణ్ణ భార్య రాజమ్మకు 60సెంట్ల భూమి ఉంది. ఇందులోనే ఆమె వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అందులో 20 సెంట్ల భూమి ప్రభుత్వానికి అప్పగించాలని అధికారులు ఏకంగా కొలతలు వేసి భవన నిర్మాణానికి సిద్ధమయ్యారు. రాజమ్మ కుటుంబ సభ్యులు అధికారులకు ఎంతగా వేడుకున్నా వారు కరుణ చూపలేదు. నిర్మాణాలు చేపట్టే ప్రక్రియతో ముందుకెళ్లారు. దీంతో శనివారం జీర్ణించుకోలేక రాజమ్మ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇది ఆత్మహత్య కాదని అధికారులు, కొందరు స్థానికుల నిర్వాకంతో జరిగిన హత్య అని ఆరోపించారు. రాజమ్మ మృతదేహాన్ని ఉంచి గ్రామస్థులు నిరసన తెలిపారు. రామాపుర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఆర్ మంజునాథ్ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

### కసాపురం ఆలయ ఈఓగా విజయరాజు

గుంతకల్లు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థాన కార్యనిర్వాహణాధికారిగా ఎం. విజయరాజు బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఈఓగా పనిచేసిన కె.వాణి ఉరుకుంద వీరణ్ణ స్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు.